## క్లుప్తంగా

### ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

**రాజంపేట టౌన్ :** రాజంపేట పట్టణం ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానం ఆవరణలో ఉన్న న్యాక్ శిక్షణా కేంద్రంలో ఎలక్ట్రీషియన్, టైలరింగ్, సీసీ కెమెరా టెక్నీషియన్ కోర్సుల్లో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు న్యాక్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.రాకేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ సంయుక్తంగా ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన ద్వారా ఈ శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు చెప్పారు. మూడు నెలల పాటు శిక్షణ ఉంటుందన్నారు. పదవ తరగతి ఆపై చదివి 18 సంవత్సరాలు పైబడి 35 సంవత్సరాల వయస్సు ఉన్నవారు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులన్నారు. ఆసక్తిగల వారు జూలై 9వ తేదీలోపు రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలతోపాటు విద్యార్హత, ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు జిరాక్స్ కాపీలను న్యాక్ కేంద్రంలో అందచేసి దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 79897 33065, 90323 82762 నెంబర్‌లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

### జూలై 5 నుంచి క్రికెట్ టోర్నీ

**నందలూరు :** నందలూరు ప్రీమియర్ లీగ్ 9వ సీజన్ హార్డ్ టెన్నిస్‌బాల్ క్రికెట్ టోర్నీ జూలై 5 నుంచి నిర్వహించనున్నట్టు ఆర్గనైజర్ పల్లె గ్రీష్మంత్ రెడ్డి తెలియజేశారు. నాగిరెడ్డిపల్లె పంచాయతీ అరవపల్లిలోని నందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో మ్యాచ్‌లు జరుగుతాయన్నారు. దివంగత తుంటి యానాదయ్య, సరోజమ్మల జ్ఞాపకార్థం వారి కుమారుడు తుంటి నందా యాదవ్ ఆధ్వర్యంలో జరిగే పోటీలు నందలూరు, ఒంటిమిట్ట, సిద్దవటం మండలాల స్థాయిలో ఉంటుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఆసక్తిగల టీమ్‌లు రూ. 1300లు ఎంట్రీ ఫీజును చెల్లించి జూలై 3వ తేదీలోపు జట్టు వివరాలు నమోదు చేసుకోవాల్సిందిగా కోరారు. విజేతగా నిలిచిన వారికి మొదటి బహుమతిగా రూ. 40 వేలు, ద్వితీయ బహుమతిగా రూ. 25వేలు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఆసక్తిగల టీమ్‌లు 90005 27227, 96763 34033 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

### సత్యమ్మకు పూజలు



పూజలందుకున్న సత్యమ్మ

**పుల్లంపేట :** అనంతంపల్లి జాతీయ రహదారి పక్కన వెలసివున్న శ్రీ సత్యమ్మతల్లికి మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారంను పురస్కరించుకొని మహిళలు వేకువజామునే తలంటు స్నానాలు ఆచరించి అమ్మవారికి పూజలు చేశారు. సత్యమ్మతల్లి ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. తదుపరి పలువురు మహిళలు అమ్మవారిని దర్శించుకొని అమ్మవారి చుట్టూ ప్రదక్షిణలు చేశారు.

### ఏఎస్ఐకి సన్మానం



ఏఎస్ఐ నరసింహులను సన్మానిస్తున్న దృశ్యం

**రాజంపేట :** శాఖపరంగా విశిష్ట సేవలందించిన ఏఎస్ఐ నరసింహులను మలిశెట్టి చిన్నయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక ఈడిగపాలెంలోని సీనియర్ జర్నలిస్టు మలిశెట్టి సుబ్బరాయుడు స్వగృహంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింహులను సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకుడు గండికోట గుల్జార్‌బాషా, కౌన్సిలర్ తుపాకుల అశోక్, టీడీపీ నాయకరాలు మలిశెటి నాగరత్నమ్మ, ఎం.వెంకటసుబ్బయ్య, సంజీవి తదితరులు పాల్గొన్నారు.

### విద్యా సామగ్రి పంపిణీ



విద్యాసామగ్రిని అందిస్తున్న ఉపాధ్యాయులు

**రామాపురం :** మండలంలోని నీలకంఠ్రావుపేట గ్రామంలో ఎంపీపీ స్కూల్‌లో విద్యాసామగ్రిని నీలకంఠ్రావుపేట టీడీపీ నాయకులు, వైస్ సర్పంచ్ మహబూబ్‌బాషా, యువ నాయకులు రియాజ్, సయ్యద్‌పీర్, షఫీ, రియాజ్, ఉపాధ్యాయులు పంపిణీ చేశారు.

### వాటర్ ప్లాంట్ ప్రారంభం

**పుల్లంపేట :** రైల్వేకోడూరు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ముక్కా రూపానందరెడ్డి శుక్రవారం కొత్తపేట పంచాయతీలో ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తామన్నారు. ఎన్టీఆర్ సుజల శ్రవంతి పథకం ద్వారా కొత్తపేట గ్రామంలోని ప్రజలకు తాగునీటి సమస్య తొలగిపోతుందన్నారు. అనంతరం సర్పంచ్ మణికంఠ రూపానందరెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పి.శంకర్ రెడ్డి, కృష్ణారెడ్డి, ఆరే సుధాకర్, రామచంద్రయ్య నాయుడు, రామచంద్రారెడ్డి, రమణ, నరసింహులు, ఎల్.వెంకటరమణ, కృష్ణమనాయుడులు పాల్గొన్నారు.

# పెన్షన్ పంపిణీలో అలసత్వం వహిస్తే చర్యలు



సిద్దవటం: సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు

**సిద్దవటం :** ఎన్టీఆర్ భరోసా పెన్షన్‌ల విధుల పట్ల అధికారులు అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు తెలిపారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో శుక్రవారం పెన్షనల్‌ల పంపిణీ విషయమై సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఎన్టీఆర్ భరోసా పెన్షన్ కార్యక్రమం జూలై 1వ తేదీ ఉదయం 5 గంటల నుంచి మధ్యాహ్నంలోపు మండల పరిధిలో ఉన్న వృద్ధులకు, దివ్యాంగులకు, వితంతువులకు అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్‌ను పంపిణీ చేయాలన్నారు. పెన్షన్ పంపిణీ చేసేటప్పుడు విధులకు హాజరై మీ లోకేషన్ పరిధిలో ఫొటోలు తీసి పెట్టాలన్నారు. స్థానిక ఎస్ఐ పెద్ద ఓబన్న మాట్లాడుతూ పెన్షన్‌ల పంపిణీ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ బాధ్యత వహించి పంపిణీ చేయాలన్నారు. ప్రభుత్వ ఖజానా నుంచి తీసుకొచ్చేటప్పుడు జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. ఏదైనా సమస్య వస్తే వెంటనే మాకు తెలియజేయాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు మాధవీలత, గ్రామ కార్యదర్శులు, వీఆర్ఓలు, డిజిటల్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

**ఇంటి వద్దకే పింఛన్లు**

**వీరబల్లె :** జూలై ఒకటో తేదీన ఇంటివద్దకే పింఛన్లు అందజేయడం జరుగుతుందని ఎంపీడీఓ రామచంద్రారెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ జూలై 1వ తేదీ నుంచి సచివాలయ సిబ్బంది ద్వారా ఇంటింటికి వచ్చి పింఛన్లు లబ్ధిదారులకు పంపిణీ చేస్తారన్నారు. మండలంలోని మొత్తం పింఛన్‌దారులు 5418 మంది ఉండగా వీరికి నగదు పంపిణీ చేయడానికి మండలంలో మొత్తం రూ.3,65,30,500లు పంపిణీ చేయనున్నట్టు పేర్కొన్నారు. పంపిణీ చేస్తున్న సచివాలయ సిబ్బంది శనివారం బ్యాంకుకు వెళ్లి నగదు డ్రా చేయాలని తెలియజేశారు. ఒకటో తేదీ ఉదయం 6 గంటల నుంచే ఇంటింటికి వెళ్లి డబ్బులు పంపిణీ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నీట్ కుంభకోణం దోషులను శిక్షించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు, విద్యార్థులు

**రాజంపేట టౌన్ :** నీట్ కుంభకోణం దోషులను కఠినంగా శిక్షించాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు నేతి నాగేశ్వర్ డిమాండ్ చేశారు. నీట్ కుంభకోణం దోషుల పట్ల మోడీ సర్కార్ ఉదాసీనంగా వ్యవహరిస్తుండటాన్ని వ్యతిరేకిస్తూ పీడీఎస్‌యూ నాయకులు శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఐటీఐ ఎదుట ప్లకార్డులు చేతపట్టి నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా నాగేశ్వర్ మాట్లాడుతూ నీట్ కుంభకోణంపై అభ్యర్థులు గగ్గోలు పెట్టినా మోడీ సర్కార్ పట్టించుకోలేదని, చివరకు సుప్రీం కోర్టు జోక్యంతో కేంద్ర విద్యాశాఖ స్పందించి రెండుచోట్ల అక్రమాలు జరిగాయని చెప్పి చేతులు దులుపుకుందని ఆరోపించారు. కుంభకోణంపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి, విద్యార్థులకు న్యాయం చేస్తామని చెప్పకపోవడం దారుణమన్నారు. బీజేపీ అధికారంలో ఉన్న గుజరాత్‌లోనూ అవకతవకలు జరిగాయని పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేయడంతో ఒక్కసారిగా అక్రమాల పుట్ట పగిలినట్లయిందన్నారు. వైద్యవిద్య ప్రవేశాల కోసం దేశవ్యాప్తంగా ఒకే ప్రవేశ పరీక్ష ఉండాలంటూ నేషనల్ మెడికల్ కౌన్సిల్ యాక్ట్‌ను మోడీ సర్కార్ 2019వ సంవత్సరంలో తీసుకొచ్చిందన్నారు. అయితే భిన్నత్వంలో ఏకత్వం కలిగిన భారతదేశంలో నీట్ సరైనది కాదని పలు రాష్ట్రాలు అభ్యంతరం పెట్టినా మోడీ సర్కార్ పట్టించుకోలేదని దుయ్యబట్టారు. నీట్ వల్ల వెనకబడిన కులాల వారికి, పేద, గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నష్టమన్న విషయం ఇప్పుడు స్పష్టమైందన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది నీట్ రాసిన అభ్యర్థులకు నష్టం లేకుండా చర్యలు తీసుకోవడంతోపాటు నీట్ పరీక్షపై పునరాలోచించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు రామ్‌చరణ్, గౌరీశంకర్, రెడ్డయ్య, నరేష్, వెంకటశివ, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణతోనే మనుగడ



మొక్కలు నాటుతున్న పోతుగుంట రమేష్ నాయుడు, బీజేపీ నాయకులు

**రాజంపేట టౌన్ :** పర్యావరణ పరిరక్షణతోనే జీవరాసుల మనుగడ సాధ్యం కాగలదని, అందువల్ల ప్రధాన మంత్రి నరేంద్రమోడీ తల్లిపేరుతో ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటాలంటూ పిలుపునిచ్చినట్లు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పోతుగుంట రమేష్‌నాయుడు తెలిపారు. మోడీ పిలుపు మేరకు రమేష్‌నాయుడు ఆధ్వర్యంలో శుక్రవారం బీజేపీ నాయకులు పట్టణంలోని మన్నూరు జెడ్పీ హైస్కూల్‌లో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో వృక్ష సంపద అంతరించుకుపోతోందని, ఇది ఇలాగే కొనసాగితే సమీప భవిష్యత్తులో విపత్కర పరిస్థితులు సంభవించవచ్చన్నారు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని ఈనెల 23వ తేదీ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి నుంచి జూలై 6వ తేదీ వరకు ఒక మొక్కను నాటాలని మోడీ పిలుపునిచ్చారన్నారు. అందులో భాగంగా తాము పర్యావరణ పరిరక్షణపై విద్యార్థుల్లో అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. అలాగే తమవంతు మొక్కలు నాటి సంరక్షించే బాధ్యతను తీసుకున్నట్లు చెప్పారు. ఈ ఏడాది వేసవిలో దేశంలో అనేక ప్రాంతాల్లో ఎండలు 50 డిగ్రీల పైనే నమోదైన విషయాన్ని గుర్తు చేశారు. అందువల్ల మొక్కలను నాటడం ప్రతి ఒక్కరూ ఒక సామాజిక బాధ్యతగా భావించాలని కోరారు. వృక్ష సంపద పెరగకుంటే సమీప భవిష్యత్తులోనే ఎండలు అధికమై ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడే పరిస్థితులు ఉంటాయని ఆందోళన వ్యక్తం చేశారు. వృక్ష సంపద పెరిగితేనే జీవరాసుల మనుగడ సాధ్యం కాగలదని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పట్టుపోగుల ఆదినారాయణ, పి.పాపయ్య, రమణ, కె.శ్రీనివాసులు, మానవత స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు షేక్ అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

# కార్మికుల సమస్యలను పరిష్కరించండి



రాయచోటి అర్బన్: మంత్రికి సమస్యలు విన్నవిస్తున్న మున్సిపల్ పారిశుధ్య కార్మికులు

**రాయచోటి అర్బన్ :** మున్సిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న పలు రకాల సమస్యలను వెంటనే పరిష్కరించాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నేతలు రాష్ట్రమంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డికి విన్నవించారు. యూనియన్ అధ్యక్షుడు శ్రీనివాసులు నేతృత్వంలో కార్మికులు శుక్రవారం మంత్రిని ఆయన క్యాంపు కార్యాలయంలో కలుసుకున్నారు. వారు మాట్లాడుతూ మున్సిపల్ సమస్యల పరిష్కారంలో గత పాలకులంతా తీరని అలసత్వం వహించారన్నారు. క్రమబద్ధీకరణ విషయంలో కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులకు తీరని అన్యాయం జరుగుతోందన్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వమైనా కార్మికులను పర్మినెంట్ చేసి ఆదుకోవాలని కోరారు. ఇందుకు మంత్రి స్పందిస్తూ సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరింపచేస్తానన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నేతలు హరి, శేషాద్రి, కేశవరావుతో పాటు పలువురు పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

**క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలి**

**రాయచోటి :** పాఠశాలలు, కళాశాలలో క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహించాలని జిల్లాలోని వ్యాయామ ఉపాధ్యాయులు మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డికి విన్నవించారు. శుక్రవారం రాయచోటిలో రాష్ట్ర క్రీడల శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డిని జిల్లా వ్యాయామ ఉపాధ్యాయులు, యూనియన్ నాయకులు కలిసి వినతిపత్రం సమర్పించారు. అప్రో ఏపీఎస్ క్రీడలు, జాతీయ క్రీడలు నిర్వహించాలన్నా, క్రీడా స్టేడియాలు నిర్మించాలని కోరారు. అలాగే వ్యాయమ ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న కొన్ని సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అలాగే రైల్వే, ఆర్టీసీ బస్సులో క్రీడాకారులకు ప్రయాణంలో రాయితీ కల్పించాలన్నారు. అలాగే 117 జీఓను రద్దు చేసి ఉన్నత పాఠశాలలో రద్దు చేసిన పీఈటీ పోస్టులను తిరిగి పునరుద్ధరించాలన్నారు. అప్పర్ ప్రైమరీ పాఠశాలకు వ్యాయామ ఉపాధ్యాయ పోస్టులు మంజూరు చేయాలని కోరారు. కేజీబీవీ పాఠశాలలో పనిచేస్తున్న వ్యాయామ ఉపాధ్యాయులకు కనీస పే స్కేలు కల్పించాలని మంత్రికి అందజేసిన వినతిపత్రం ద్వారా యూనియన్ నాయకులు శివశంకర్ రెడ్డి, అమర్నాథ్ రెడ్డి, రామచంద్ర, జగదీశ్వరయ్యలు కోరారు.

**పరామర్శ**

**రాయచోటి టౌన్ :** మాజీ ఎమ్మెల్యే, ఎంపీ సుగవాసి పాలకొండ్రాయుడును రాష్ట్ర రవాణా, క్రీడా, యువజన శాఖ మంత్రి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి పరామర్శించారు. శుక్రవారం రాయచోటి పట్టణంలోని పాలకొండ్రాయుడు స్వగృహానికి వెళ్లి ఆయన యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పలు అంశాలపై చర్చించారు.

# ఎన్‌సీసీ విద్యార్థులకు అభినందన



శిక్షణలో పాల్గొన్న ఎన్‌సీసీ విద్యార్థులతో పాఠశాల అధ్యాపకులు

**చిట్వేలి :** 30 ఆంధ్ర బెటాలియన్ ఎన్‌సీసీ ట్రూప్ చిట్వేలి జెడ్పీ ఉన్నత పాఠశాల ఎన్‌సీసీ విద్యార్థులు జాతీయస్థాయి శిక్షణను పూర్తి చేసుకున్నట్లు ప్రధానోపాధ్యాయులు పురుషోత్తం రెడ్డి, ఎన్‌సీసీ ట్రూప్ కమాండర్ పసుపుల రాజశేఖర్‌లు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎన్‌సీసీ కమాండర్ రాజశేఖర్ మాట్లాడుతూ ఈనెల 15వ తేదీ నుంచి 26వ తేదీ వరకు గుంటూరులో జరిగిన జాతీయ శిక్షణా శిబిరంలో పాఠశాల నుంచి ఎన్‌సీసీ విద్యార్థులు ఖ్యాతి, వర్శినీ, భవ్య, ముజాహిద్, దిలీప్, రామ్ చరణ్‌లు పాల్గొన్నారన్నారు. రాజస్థాన్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి పాల్గొన్న వారిలో చిట్వేలి విద్యార్థులు ఉండడం గర్వకారణమన్నారు. అనంతరం శిక్షణలో పాల్గొన్న విద్యార్థులను పాఠశాల అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఏబీఎస్ ప్రసాద్, దుర్గరాజు తదితర ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

### సహజ వనరులే భవిష్యత్తు




గ్యాస్ వినియోగంపై జాగ్రత్తలు వివరిస్తున్న ప్రిన్సిపల్

**సంబేపల్లె :** మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ఇండియన్ గ్యాస్ వారి ఆధ్వర్యంలో సహజ వాయువుల సద్వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ సి.దిలీప్ కుమార్ విద్యార్థినులకు గ్యాస్ వినియోగంపై, గ్యాస్ వాడకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. సిలిండర్ వాడకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. అలాగే సహజ వనరులైన సోలార్ ఎనర్జీ, విండ్ ఎనర్జీ, టైడల్ ఎనర్జీలపైనే భవిష్యత్తు ఆధారపడి ఉందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినులు, ఉపాధ్యాయులు, ఇండేన్ గ్యాస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ అధికారులు

**చిట్వేలి :** సికిల్ సెల్ అనిమియా వ్యాధిపట్ల అప్రమత్తంగా ఉండాలని ఐసీడీఎస్ చిట్వేలి సీడీపీఓ రాజేశ్వరి సూచించారు. శుక్రవారం గట్టుమీదపల్లి ఎస్టీ కాలనీలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సికిల్ సెల్ అనిమాయా వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సీడీపీఓ మాట్లాడుతూ సికిల్ సెల్ అనిమియా వ్యాధి అత్యంత ప్రమాదకరమన్నారు. వంశపారంపర్యంగా సంక్రమించే ఈ వ్యాధిపట్ల ప్రత్యేకించి మహిళలు, పిల్లలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ వ్యాధి సోకిన వారిలో నొప్పులు రావడం, తరచూ జ్వరం రావడం, ఆయాసం, హార్ట్ స్ట్రోక్, కాళ్లు చేతులు పడిపోవడం, కంటి రెటీనా దెబ్బతినడం, కిడ్నీ సమస్యలు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది వంటి లక్షణాలు కనిపిస్తాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ హిమోగ్లోబిన్ పరీక్ష చేయించుకుంటూ ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ గ్రేడ్-2 సూపర్‌వైజర్ సురేఖ రాణి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రేమ, ఉపాధ్యాయునీ వసంత, అంగన్‌వాడీ వర్కర్ వెంకటసుబ్బమ్మ, గ్రామ మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో అమ్మవారికి రాహుకాల పూజలు



భక్తులకు దర్శనమిస్తున్న భద్రకాళి అమ్మవారు

**రాయచోటి టౌన్ :** రాయచోటి శ్రీ భద్రకాళి అమ్మవారికి రాహుకాల పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారికి రాహుకాల పూజలలో శుక్రవారం భాగంగా అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం పూలు, పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలు, నిమ్మకాయలతో అల్లిన హారాలతో అందంగా అలంకరించారు. తరువాత మహిళలు అమ్మవారికి నిమ్మకాయలపై వత్తులు వెలిగించి హారతులు పట్టారు. తరువాత అమ్మవారి దర్శన ఏర్పాటు చేశారు. ఈ పూజలు ఆలయ ఈఓ డివి రమణారెడ్డి ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో నిర్వహించారు.



రాహుకాల పూజలు నిర్వహిస్తున్న మహిళలు

### దోమల నిర్మూలన సామాజిక బాధ్యత

**పీలేరు రూరల్ :** దోమల నిర్మూలన సామాజిక బాధ్యత అని జిల్లా మలేరియా నివారణ అధికారి డాక్టర్ వేణుగోపాల్ అన్నారు. శుక్రవారం పీలేరులో వివిధ పాఠశాలల్లో ఫ్రైడే డ్రైడే కార్యక్రమంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దోమ కాటుతో మలేరియా, డెంగీ, చికున్ గున్యా, మెదడువాపు వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందన్నారు. ఇలాంటి వ్యాధుల నుంచి మనల్ని మనం కాపాడుకోవాలని సూచించారు.

# కడప ఉక్కు పరిశ్రమను నిర్మించాలి




మాట్లాడుతున్న పీఆర్ఎస్‌వైఎఫ్ నాయకులు

**కడప ఎడ్యుకేషన్ :** రాయలసీమ ప్రాంతంలోని నిరుద్యోగుల సమస్యల పరిష్కారం కోసం కడప ఉక్కు పరిశ్రమ పనులను ప్రారంభించాలని పీఆర్ఎస్‌వైఎఫ్ రాష్ట్ర కన్వీనర్ కన్నెలూరు శంకర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం కడప నగరంలోని పీఆర్ఎస్‌వైఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. కడప ఉక్కు పరిశ్రమ నిర్మాణం కడప జిల్లా ప్రజల చిరకాల ఆకాంక్ష అన్నారు. గతంలో కడప ఉక్కు రాయలసీమ హక్కు నినాదంతో ప్రజలు, యువత, నిరుద్యోగులు అనేక పోరాటాలు చేశారన్నారు. గతంలో పాలకవర్గాలపై ఒత్తిడి పెంచడంతో శంకుస్థాపన చేయడం జరిగిందన్నారు. కానీ పనులు చేపట్టలేదన్నారు. ఉక్కు పరిశ్రమ నిర్మాణం జరిగితే రాయలసీమ ప్రాంతంలోని వేల మంది నిరుద్యోగులకు ఉపాధి దొరుకుతుందన్నారు. నూతనంగా ఏర్పడిన ప్రభుత్వమైనా ఉక్కు పరిశ్రమ ఏర్పాటుపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీఆర్ఎస్‌వైఎఫ్ జిల్లా కన్వీనర్ నాగేంద్ర బాబు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# జూలై 25న హార్సిలీహిల్స్‌లో శిక్షణ తరగతులు

**మదనపల్లె :** తంబళ్లపల్లె నియోజకవర్గం బి.కొత్తకోట మండలం హార్సిలీహిల్స్‌లో జూలై 25న ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్రస్థాయి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ఉపాధ్యక్షుడు జె.రామచంద్రయ్య తెలిపారు. శుక్రవారం మదనపల్లె మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కమిటీ సమావేశం స్థానిక ఎస్టీయూ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రామచంద్రయ్య మాట్లాడుతూ... హార్సిలీహిల్స్‌లో జరగనున్న మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్రస్థాయి శిక్షణ తరగతులకు రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్, కార్పొరేషన్ల నుంచి దాదాపు 300 మంది పారిశుధ్య, ఇతర తరగతుల కార్మికులు పాల్గొంటారన్నారు. కార్మిక హక్కులు, చట్టాలు, శ్రమదోపిడీ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై కార్మికులకు అవగాహన కల్పించేందుకు శిక్షణ తరగతులు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. మూడోసారి దేశంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం కార్మిక చట్టాలను, హక్కులను నిర్వీర్యం చేస్తోందని, గడచిన పదేళ్లలో ఏ ఒక్కరోజు కార్మికసంఘాల నేతలను పిలిచి, కార్మిక సమస్యలపై చర్చ జరపలేదన్నారు. దేశసంపదను కార్పొరేట్లపై ఉన్న శ్రద్ధ దేశంలో సంపద సృష్టిస్తున్న కార్మికసంక్షేమంపై లేదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్, కార్పొరేషన్లలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసి సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి సురేష్‌కుమార్, ఏఐటీయూసీ చిత్తూరుజిల్లా గౌరవాధ్యక్షులు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

### అంకితభావంతో విధులు నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న పీడీ శశికళ

**సంబేపల్లె :** మండల వ్యాప్తంగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలలో పనిచేసే కార్యకర్తలు, ఆయాలు అంకితభావంతో పనిచేయాలని ఐసీడీఎస్ పీడీ శశికళ పేర్కొన్నారు. మండలంలోని దేవపట్ల సెక్టార్‌లో శుక్రవారం కార్యకర్తలు, ఆయాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సిబ్బంది సమయం పాటిస్తూ చిన్నపిల్లలకు పౌష్టికాహారాన్ని అందించేలా చూడాలన్నారు. చిన్నపిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

### నెలరోజుల్లో నిర్మాణాలు చేపట్టకపోతే పట్టా రద్దు

**మదనపల్లె :** పట్టణంలోని బీకే.పల్లె రెవెన్యూ గ్రామంలో ఏపీ స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో కేటాయించిన 22 లేఅవుట్లలో పట్టాలు మంజూరై నిర్మాణాలు చేపట్టనివారు, నెలరోజుల్లో ఇళ్లు నిర్మించుకోవాలని, లేనిపక్షంలో పట్టా రద్దు చేస్తామని తహసీల్దార్ రమాదేవి హెచ్చరించారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ఆదేశాల మేరకు హౌసింగ్, రెవెన్యూ అధికారులు బీకే.పల్లె కాలనీలో పర్యటించారు. ఈ కాలనీలో ఇందిరమ్మ ఇళ్ల కింద 22 లేఅవుట్లను కనపరిచి, 4,842 మందికి ఇళ్లు కట్టుకునేందుకు పట్టాలు, ఆర్థిక సహాయం అందించడం జరిగిందన్నారు. వీరిలో చాలామంది వరకు ఇళ్లు నిర్మించుకుని, నివాసం ఉంటున్నారని, అయితే దాదాపు 800 వరకు ఇంకా నిరుపయోగంగా ఉన్నాయన్నారు. వీటిని కొందరు అక్రమార్కులు కబ్జాలు చేసి ఇతరులకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. దీనిపై క్షేత్రస్థాయి పరిశీలన చేసేందుకు ఎమ్మెల్యే షాజహాన్‌బాషా 22 లేఅవుట్లకు 22 బృందాలను ఏర్పాటు చేయాల్సిందిగా ఆదేశించినట్లు తెలిపారు. ప్రతి బృందంలోనూ సర్వేయర్, వీఆర్వో, హౌసింగ్, అడ్మిన్ సెక్రటరీ ఉంటారని, వీరు ఇంటింటికీ వెళ్లి అర్హులు, అనర్హుల జాబితాను గుర్తిస్తారని తెలిపారు. 2006, 2007లో పట్టాలు మంజూరై ఇప్పటివరకు నిర్మాణాలు చేపట్టని వారు ఇదే చివరి అవకాశంగా భావించి 30రోజుల్లో స్థలాన్ని స్వాధీనం చేసుకోవాల్సి ఉంటుందన్నారు. సర్వేలో స్థలం ఖాళీగా ఉందని తేలితే, మంజూరు చేసిన పట్టాను రద్దుచేసి, ఆ స్థలాన్ని అర్హులైన పేదలకు కేటాయించడం జరుగుతుందన్నారు.

# రైతాంగ సమస్యలు పరిష్కరించాలని నిరసన

**ములకలచెరువు :** రైతాంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఐ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఖరీఫ్ సీజన్‌లో పంటల సాగు కోసం రైతులకు రూ.20 వేల పెట్టుబడి సాయం అందిస్తామని చెప్పిన మాటను ప్రభుత్వం నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే కౌలు రైతులకు గుర్తింపు కార్డులను మంజూరు చేయాలని, రూ.5 లక్షల దాకా బ్యాంకుల ద్వారా పంట రుణాలు అందించాలని, రైతాంగానికి ఇచ్చిన అన్ని హామీలను ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఐ నాయకులు అంజనప్ప, నారాయణ, రామచంద్ర, రమణారెడ్డిలు పాల్గొన్నారు.